క్లుప్తంగా

రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

దేవరాపల్లి : బోయిలకింతాడ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎం.అలమండ ఫీడర్‌లో శుక్రవారం రెండు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ ఏఈఈ కె. శంకరరావు తెలిపారు. ములకలాపల్లి, కొత్తపెంట గ్రామాలలో లైన్ మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఇంజినీరింగ్ కార్మికుల వినూత్న నిరసన



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

నర్సీపట్నం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శిబిరం నుండి ర్యాలీగా వెళ్లి అబిద్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఐక్య కార్యచరణ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి మహేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి వీడి ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ నియామకం



గ్రామ పార్టీ అధ్యక్షుడుగా ఎన్నికైన వివేకానంద నాయుడుకు నియామక పత్రం ఇస్తున్న దృశ్యం

గొలుగొండ: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీ వైఎస్సార్‌సీపీ కమిటీ అధ్యక్షుడుగా చింతల వివేకనందనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పార్టీ పరిశీలకుడు పరవాడ కవి, సర్పంచ్, జిల్లా మహిళాపార్టీ అధ్యక్షురాలు లోచల సుజాత, స్థానిక ఎంపీటీసీలు బుల్లిప్రసాద్, మామిడి కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ అనుబంధ కమిటీలు నియమించారు. గ్రామ కమిటీ అధ్యక్షుగా వివేకందనాయుడు, యువజన విభాగం దిగుమర్తి రమేష్, రైతు విభాగం సత్యన్నారాయణ,మహిళా విభాగం ఆదిలక్ష్మిని ఎన్నికోవడం జరిగింది. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరం కలసికట్టుగా పనిచేస్తున్నట్టు తెలిపారు.

క్వారీ తెరవద్దంటూ ఆందోళన



క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న జీ.కోడూరు రైతులు

మాకవరపాలెం: పంటలకు నష్టం కలిగించే క్వారీ తెరవద్దంటూ జీకోడూరు గ్రామానికి చెందిన దళిత రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని జీకోడూరు రెవెన్యూలోని 332 సర్వే నంబర్‌లో గతంలో నల్లరాతి క్వారీ నిర్వహించేవారు. మరలా ఈ క్వారీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారని చుట్టుపక్కల గల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారంతా క్వారీ వద్ద ఆందోళన చేశారు. క్వారీ నిర్వహిస్తే బ్లాస్టింగ్ సమయంలో రాళ్లు పడి తమ జీడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. అధికారులు స్పందించి క్వారీని ప్రారంభించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కొత్తపెంట పాలసొసైటీ అధ్యక్షుడి ఎన్నిక



కిర్ల నాగేశ్వరరావు

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంట విశాఖ డెయిరీ పాల సొసైటీ అధ్యక్షుడిగా కిర్ల నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సొసైటీలోని ఇద్దరు డైరెక్టర్లకు పదవీ కాలం పూర్తి కావడంతో గురువారం డెయిరీ అధికారుల సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. గతంలో పని చేసిన కిర్ల నాగేశ్వరరావు, సబ్బవరపు శంకరరావులను సొసైటీ పరిధిలోని సభ్య రైతులంతా డైరెక్టర్లగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం డైరెక్టర్లంతా కిర్ల నాగేశ్వరరావును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని సర్పంచ్ రొంగలి వెంకటరావు, మాజీ సర్పంచ్ శంకరరావు, రెడ్డి పైడంనాయుడు, కిర్లం జగన్నాథం, వేతన కార్యదర్శి కర్రి సోమేశ్వరరావు, పాడి రైతులు అభినందించారు.

సమస్యల గృహం



వంట గదిలో పెచ్చులూడిన భవనం శ్లాబ్



కొరువాడ బీసీ బాలుర వసతిగృహం

- భయం గొలుపుతున్న కొరువాడ బీసీ బాలుర వసతిగృహం
- భవనం శ్లాబ్ వెంట పెచ్చులూడుతున్న వైనం
- పలు చోట్ల ఛిద్రమైన గచ్చులు, కిటికీలు, ద్వారబంధాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కె.కోటపాడు : కొరువాడ గ్రామంలో గల బీసీ బాలుర వసతిగృహం బలహీనంగా మారింది. వసతిగృహంలో అందుబాటులో ఉన్న 8 తరగతి గదులతో పాటు వంట గదిలో శ్లాబ్ వెంట పెచ్చులూడిపడుతున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో శ్లాబ్ వెంట పెచ్చులు రాలిపడడంతో ప్రమాదాలు ఏమైనా చోటు చేసుకుంటాయోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వసతిగృహంలో ప్రస్తుతం 40 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరు ఉండే భవనాలన్నీ పెచ్చులూడి పడుతుండడం కారణంగా వర్షాల సమయాల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. భవనంతో పాటు వసతిగృహంలో గచ్చులు కూడా పలు చోట్ల చిద్రమయ్యాయి. భవనాలకు గల కిటికీలు, ద్వారబంధాలు పలు చోట్ల మరమ్మతులకు గురయ్యాయి. భవనం శిథిలావస్థకు చేరడంతో వసతిగృహంలో ఈ ఏడాది విద్యార్థులను చేర్పించడానికి వారి తలి దండ్రులు ఆసక్తిని చూపడం లేదు. దీంతో ఈ ప్రభావం అడ్మిషన్‌లపై పడుతుంది. వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులకు అందుబాటులో ఉన్న వసతిగృహానికి పూర్తి స్థాయి మరమ్మతు పనులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



విద్యార్థుల గదిలో పెచ్చులూడుతున్న దృశ్యం

భవనానికి మరమ్మతులు జరపాలి



వసతిగృహంలో ఉన్న గదులతో పాటు వంట గది నుంచి శ్లాబ్ నుంచి పెచ్చులు రాలిపడుతున్నాయి. వర్షాలకు గదులు చెమ్మగిల్లుతున్నాయి. ఎప్పుడు ఏ పెచ్చులు పడి ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందోనని మాకు భయంగా ఉంది. పెద్ద వర్షాలు పడే సమయాల్లో పెచ్చులూడిన శ్లాబ్ ప్రాంతం నుంచి వర్షపునీరు గదుల్లోనికి వస్తుంది. – స్వామి, వసతిగృహ విద్యార్థి, 10వ తరగతి, కొరువాడ

అదనపు గదిని సిద్ధం చేస్తున్నాం

కొరువాడ బీసీ బాలుర వసతిగృహంలో పలు గదులు మరమ్మతులకు గురయ్యాయి. పెచ్చులూడుతున్న శ్లాబ్ వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వసతిగృహ ప్రాంగణంలో ఉన్న గదిని రూ.2.50 లక్షల నిధులను మంజూరు చేసి విద్యార్థులు ఉండేందుకు తాత్కాలికంగా సిద్ధం చేస్తున్నాం. భవనానికి పూర్తి స్థాయి మరమ్మతు పనులకు నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. – ఎం.నరసింహులు, ఏబీసీడబ్ల్యూ, చోడవరం

రథయాత్రకు సిద్ధమైన జగన్నాథుడు



ఉత్సవాలకు ముస్తాబైన సుభద్ర, బలభద్రుడు సమేతుడైన శ్రీ జగన్నాథస్వామి ఉత్సవ మూర్తులు

చోడవరం: శ్రీ జగన్నాథస్వామి రథయాత్ర, దశావతార దర్శన ఉత్సవాలకు చోడవరంలో భారీగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 27 నుంచి జులై 7వ తేదీ వరకు జగన్నాథస్వామి ఉత్సవాలు నిర్వహించేందుకు చోడవరం కేశవస్వామి ఆలయంలో ఉపాలయంగా ఉన్న శ్రీ జగన్నాథస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉత్సవాలకు ముందురోజు గురువారం ఆలయంలో సుభద్ర, ఫలభద్రుడు సమేతుడైన శ్రీ జగన్నాథస్వామివారికి పెరుగు, పాలతో విశేష అభిషేకం చేశారు. పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు స్వామివారి రథయాత్ర నిర్వహిస్తారు. మేళతాళాలు, దాససాహిత్య కోలాటక బృందాల మధ్య స్వామివారి ఆలయం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర మెయిన్‌రోడ్డు మీదుగా వినాయకుడి గుడి, కోఆపరేటివ్ కాలనీ, శివాలయంవీధి, వెలమవీధి, చిన బజార్ మీదుగా బొల్లవీధి రామాలయం ప్రాంగణానికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. అక్కడ పది రోజుల పాటు స్వామివారు దశావతారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. 7వ తేదీన స్వామివారి తిరుగు రథయాత్ర జరుగుతుందని దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని వారు చెప్పారు.

మాడుగుల: మాడుగులలో జగన్నాథ స్వామి రథయాత్ర శుక్రవారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా ఆషాడ మాసంలో నిర్వహించే ఈ రథయాత్ర ఈ ఏడాది కూడా స్థానిక కోటబయలు పక్కన్న గల జగన్నాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

అనంతరం ఆలయం నుంచి గవరవీధిలో గల ఇంద్రద్యుమ్న హాలు వద్ద ఊరేగింపుగా బయలుదేరి వెళ్తుంది. తొమ్మిది రోజుల పాటు వేరు వేరు అవతారాలల్లో జగన్నాథుడు దర్శనమిస్తారు. జగన్నాథస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు, నిర్వహించనున్నారు. జగన్నాథుడు, బలబద్రుడు, సుభద్రదేవి, విగ్రహాలకు పూజలు నిర్వహిస్తారు.

తాటిపర్తిలో వరి విత్తనాల పంపిణీ



తాటిపర్తిలో వరి విత్తనాలను అందిస్తున్న సర్పంచ్ దేవీ, సంజీవరావు

మాడుగుల రూరల్ : ఖరీప్ కాలంలో రైతులు సాగు సూచనలను తప్పకుండా పాటించి మంచి దిగుబడిని పొందాలని తాటిపర్తి సర్పంచ్ అల్లంగి గౌరీదేవి, సంజీవరావు అన్నారు. గ్రామంలో గల రైతు సేవా కేంద్రంలో గురువారం ఉద్యానవన సహాయకురాలు బి.అలేఖ్య ఆధ్వర్యంలో వరి విత్తనాల పంపిణీ చేపట్టారు. రైతులకు ఈ వరి విత్తనాలను రాయితీపై అందిస్తున్నట్టు ఆమె తెలిపారు. మత్స్యశాఖ సహాయకురాలు హేమలత, వీఆర్వో సత్యనారాయణ, నాయకులు సలుగు లక్ష్మి, వంతల అప్పారావు పాల్గొన్నారు.

గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు



నట్టల నివారణ మందును గొర్రెలు, మేకలకు వేస్తున్న పశువైద్యాధికారి నాయుడు



పి.పి.అగ్రహారంలో మందులు పంపిణీని ప్రారంభించిన ఏరియా సహాయ సంచాలకులు చిట్టినాయుడు

కె.కోటపాడు : గొర్రెలు, మేకల కడుపులో ఏలికపాములు బెడద కారణంగా అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు ముందస్తుగా నట్టల నివారణ మందును పెంపకందారులు వేయించాలని చౌడువాడ పశువైద్యాధికారి సీహెచ్.వై.నాయుడు అన్నారు. గొండుపాలెం గ్రామంలో గురువారం 1100 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేసే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి నాయుడు మాట్లాడుతు ఏలికపాముల కారణంగా గొర్రెలు, మేకల్లో పొట్టపొంగడం, గడబ వాపు సమస్య బారిన పడతాయన్నారు. ఈ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు 2 నెలల వయస్సు పైబడిన గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేయనున్నట్టు తెలిపారు. పశుసంవర్ధకశాఖ ద్వారా ఏడాదికి రెండు పర్యాయాలు ఉచితంగా మందును వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం జూలై 10 వరకూ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కనకారావు, తేజ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : పోతనవూడి అగ్రహారం గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మాడుగుల ఏరియా పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ వి.చిట్టినాయుడు ప్రారంభించారు. 16 మంది గొర్రెలు, మేకలు పెంపకందారుకు చెందిన 50 గొర్రెలు, 430 మేకలకు ఉచితంగా నట్టలు నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.జె.పురం పశువైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నానాజీ, కూటమి నాయకులు ధర్మిశెట్టి నారాయణరావు, నాగరాజు, పశుసంవర్ధక సహాయకులు కన్నంనాయుడు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంకులో ఆధార్ సేవలు పునఃప్రారంభం



మాడుగుల ఇండియన్ బ్యాంకులో ఆధార్ సేవలు ప్రారంభిస్తున్న నాగేశ్వరావు తదితరులు

మాడుగుల రూరల్ : మాడుగుల ఇండియన్ బ్యాంకులో ఆధార్ సర్వీసు సెంటర్ గత ఆరుమాసాలుగా సాంకేతిక కారణాలు వల్ల పని చెయ్యలేదు. తాజాగా బ్యాంకులో ఆధార్ సర్వీసు సెంటరును తిరిగి ప్రారంభించారు. బ్యాంకు మేనేజర్ నాగేశ్వరావు, సహాయ మేనేజర్ జయరామ్ గురువారం సర్వీసు సెంటర్‌ను ప్రారంభించారు. బ్యాంకులో ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆధార్ ఇన్‌చార్జి జెర్రిపోతుల రాజు, ఆపరేటర్ పడాల వంశీ పాల్గొన్నారు.


నూతన ఎంపీహెచ్‌ఈవోగా గోవిందరావు



ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు

రోలుగుంట: రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్‌ఈవోగా శెట్టి గోవిందరావు విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడ ఎంపీహెచ్‌ఈవోగా విధులు నిర్వహించిన ఐ.సురేష్ కోటౌరట్ల మండలం బదిలీ కావడంతో కోటఉరట్ల మండలం కొడవలపూడి వెంకటాపురంలో పనిచేస్తున్న గోవిందరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకారం



అంబేడ్కర్

రావికమతం : రావికమతం నూతన తహసీల్దార్‌గా ఎస్.వి.అంబేడ్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పరవాడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. రెవెన్యూ సంబంధిత సేవలు నిర్దేశించిన సమయంలో ప్రజలకు అందే విధంగా కృషి చేస్తానన్నారు. భూ సంబంధిత సమస్యలపై రైతులకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ వెంకటరమణ మాకవరపాలెం బదిలీ అయ్యారు.

'జూలై 9 సమ్మెను విజయవంతం చేయండి'



ఎన్టీపీసీ వద్ద కరపత్రాలను పంపిణీ చేస్తున్న గనిశెట్టి

పరవాడ: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన లేబర్ కోడ్స్ రద్దు డిమాండ్‌తో జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ మెయిన్‌గేట్ వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కనీస వేతనాల చట్టం అమలు చేసి, కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పు చేసే చర్యలను విరమించాలన్నారు. సమాన పనికి సమాన వేతన చట్టాలను తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులకు 8 గంటల పని వేళల్ని 12 గంటలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకు ఊడిగం చేసే పాలకుల విధానాలను వ్యతిరేకించాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం దొంగచాటుగా నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి, అమలుకు ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. దీన్ని నిరసిస్తూ దేశంలో ఉన్న కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిటు నాయకులు పైల పోతినాయుడు, పి.గోవిందరాజు, పైల సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు జోలికిపోతే జీవితం చిత్తు



ర్యాలీ అగ్రభాగాన ఆర్డీవో వి.వి.రమణ, డీఎస్పీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు



మాకవరపాలెంలో మానవహారంగా ఏర్పడ్డ విద్యార్థులు

- యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- డీఎస్పీ శ్రీనివాసరావు
- పట్టణంలో భారీ ప్రదర్శన



కె.కోటపాడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పోలీసులు

నర్సీపట్నం : యువత మత్తుకు బానిసై బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారని డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం నర్సీపట్నంలో పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, పురపాలకశాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ముందు ఆర్డీవో వి.వి.రమణ, డీఎస్పీ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమ చుట్టూ ఉన్న మాదక ద్రవ్యాల దుర్వినియోగం గురించి సమాచారాన్ని పంచుకోవాలన్నారు. గంజాయి ముప్పును అరికట్టేందుకు పోలీసుశాఖ ప్రత్యేక కార్యచరణ రూపొందించిందన్నారు. యువతలో మార్పు తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలో మార్పు తీసుకువచ్చేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. యువత మత్తులో చట్టాన్ని చేతిలోకి తీసుకొని ఘర్షణలకు దిగడం, హత్యలు చేయడం వంటి సంఘటనలకు పాల్పడుతున్నారన్నారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కదలికలపై కుటుంబ సభ్యులు తరచూ నిఘా అవసరమన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. అబిద్‌సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం మీదగా ఆర్టీసీ కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, తహసీల్దార్లు రామారావు, వెంకటేశ్వరరావు, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ జ్యోతి, ఏరియా ఆస్పత్రి సూపరిండెంటెంట్ సుధా శారద, సీడీపీవో జి.వి.రమణి, సీఐలు జి.గోవిందరావు, ఎల్.రేవతమ్మ, ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్, వివిధ కళాశాలల విద్యార్థులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు శ్రీనివాసరావు విద్యార్థులతో ప్రతిష్ణ చేయించారు.

మాకవరపాలెం: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి సూచించారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. విద్యార్థులు డ్రగ్స్ వద్దు..జీవితం ముద్దు అంటూ నినాదాలు చేశారు.



రోలుగుంటలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ ఉద్యోగులు

ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోలుగుంట: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని రోలుగుంట హెచ్‌ఎం శేషగిరిరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి కోరారు. గురువారం మండలంలో పలు పాఠశాలల్లో మాదద్రవ్యాల వినియోగంగా వ్యతిరేకంగా ఐసీడీఎస్, విద్యాశాఖ సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ చేశారు. మాదకద్రవ్యాల వల్ల నష్టాలు, కష్టాలను ఉపాధ్యాయుడు ఆర్‌వీఎస్‌ఆర్ శర్మ వివరించారు. ఈ కార్యక్రమాలు, కొవ్వూరు, కొండపాలెం తదితర గ్రామాల్లో కూడా నిర్వహించారు.

గొలుగొండ: ప్రపంచ మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవం సందర్భంగా ఏఎల్‌పురంలో గురువారం అంగన్‌వాడీ సిబ్బంది ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువత చదువులపై దృష్టి సారించి మంచి భవిష్యత్‌ను ఎంచుకోవాలని తెలిపారు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల అనేక అనర్థాలు వస్తాయని వాటికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ఏఎల్‌పురం అంగన్‌వాడీ సెక్టార్ టీచర్లు పాల్గొన్నారు.

కె.కోటపాడు : యువత మాదకద్రవ్యాల అలవాటుకు దూరంగా ఉండాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. కె.కోటపాడులో పోలీసుల ఆధ్వర్యంలో నషా ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కె.కోటపాడుతో పాటు మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ మండలాల నుండి ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతు చిన్న వయస్సులోనే మత్తుకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందన్నారు. అనకాపల్లి డీటీసీ డీఎస్పీ మోహన్‌రావు మాట్లాడుతూ డ్రగ్స్ అలవాటు పడిన వారు ఇప్పటికైనా అలవాటును వీడాలని హితవు పలికారు. డ్రగ్స్‌తో పట్టుబడితే చట్ట ప్రకారం కఠిన శిక్షలు పడతాయన్నారు. కె.కోటపాడు సీఐ పైడపునాయుడు, తహసీల్దార్ భుజంగరావు, కె.కోటపాడు, ఎ.కోడూరు, దేవరాపల్లి, చీడికాడ, మాడుగుల ఎస్ఐలు ఆర్.ధనుంజయ్, లక్ష్మినారాయణ, మల్లేశ్వరరావు, సతీష్, నారాయణరావు పాల్గొన్నారు.



ఏఎల్‌పురంలో అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీ సిబ్బంది



చోడవరంలో ప్రతిజ్ఞచేస్తున్న విద్యార్థులు, ఎమ్మెల్యే రాజు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది

చోడవరం: మాదకద్రవ్యాలు వినియోగించడం నేరమంటూ విద్యార్థులు, సంఘ సేవలకులు,అధికారులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. చోడవరం పట్టణంలో ఉన్న అన్ని కాలేజీలు, పాఠశాల విద్యార్థులు, పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చోడవరం కాలేజీ జంక్షన్ నుంచి మెయిన్‌రోడ్డుపై ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్, వినాయకుడి గుడి జంక్షన్ మీదుగా కొత్తూరు నాలుగురోడ్లు కూడలి వరకూ ర్యాలీ చేశారు. అక్కడ మానవహారం చేసి అక్కడ నుంచి గర్ల్స్ హైస్కూల్ ఆవరణంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, సీఐ అప్పలరాజు, ఎక్సైజ్ సీఐ పాపునాయుడు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, మాజీ జెడ్పీటీసీ మచ్చిరాజు, జనసేన మండల నాయకులు మూలునాయుడు, రమేష్ పాల్గొన్నారు. ఉషోదయ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీకాలేజీల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ రమణాజీ పాల్గొన్నారు.